# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మిక శాఖపై ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- విశాఖపట్నం, విజయవాడలో చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్టు పనులను త్వరితగతిన చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
- ఎన్టీఆర్ భరోసా సామాజిక పించన్లను సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.
- బాలలకు బంగారు బాల్యాన్ని అందించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్ధి అన్నారు.
- ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రేపు మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

=====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మిక శాఖపై అమరావతి సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ విధానమని, కార్మికుల హక్కులు పరిరక్షించాలన్నారు. సంక్లిష్టమైన నిబంధనలతో పరిశ్రమలపై వేధింపులు ఉండకూడదని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై థర్డ్ పార్టీతో ఆడిట్ నిర్వహించాలన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రులను బలోపేతం చేస్తామని.. రాష్ట్ర వాటా నిధులు కూడా విడుదల చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విస్మరించిన 10 లక్షల రూపాయల “చంద్రన్న బీమా”కు త్వరలో శ్రీకారం చుడతామన్నారు.

=====================

అమరావతి రాజధాని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సిటీగా ఉండాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపకల్పన చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ,

సీఆర్డీయే అధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ, విశాఖపట్నం, విజయవాడలో చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్టు పనులను త్వరితగతిన చేపట్టమని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఫేజ్-1లో 46 కిలో మీటర్ల మేర 11 వేల 400 కోట్ల రూపాయల వ్యయంతోనూ నిర్మిస్తామని, తరువాత ఫేజ్-2లో 30 కిలోమీటర్ల మేర 5 వేల 734 కోట్ల రూపాయలతో మెట్రో రైలు నిర్మిస్తామన్నారు. అలాగే సాంకేతిక సౌలభ్యత ఉట్టిపడేలా రాజధాని నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారని మంత్రి వెల్లడించారు.

=====================

సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు. సెప్టెంబర్ 1న ఉద్యోగులకు సెలవు దినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వివిధ కారణాల వల్ల సామాజిక పెంఛన్లు ఆగస్టు 31వ తేదీన అందకపోతే సెప్టెంబర్ 2వ తేదీన అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. పెంఛన్లు లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి కోరారు.

=====================

బాలలకు బంగారు బాల్యాన్ని అందించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈరోజు నిర్వహించిన బంగారు బాల్యం కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బంగారు బాల్యం కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఏ.ఆర్.దామోదర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ, బాలలకు కుల, మతాలకు అతీతంగా బాల్యాన్ని అందించాలన్నారు. అందరికీ చదువుకునే అవకాశాలు కల్పించాలని, ఇది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, మనందరి సమష్టి కృషితోనే సాధ్యమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలల హక్కులకు భంగం కలుగుతోందని, పిల్లలు అందరూ మన పిల్లల్లుగానే భావించాలన్నారు. ఎక్కడ పిల్లల హక్కులకు భంగం కలిగినా మనందరం వారి రక్షణకు ముందుకు రావాలన్నారు.

(వాయిస్ 26 సెకన్లు)

=====================

తెలుగు వ్యవహారిక బాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం. జాహ్నవి ఈ రోజు ఆయన చిత్ర పటానికి పూలమాలను వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రాంధికంలో ఉన్న తెలుగును వాడుక భాషకు తీసుకువచ్చి రచనలు చేయడం వల్లే భాషా సౌందర్యం ఇనుమడించిందని ఆమె అన్నారు.

తెలుగు భాష పునరుజ్జీవమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసు శాసనసభ్యులు కూన రవికుమార్ అన్నారు. తెలుగు భాష అభివృద్ధి కోసం తమ ప్రభుత్వమే గతంలో కూడా ఎంతో కృషి చేసిందన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఈరోజు తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.

విరామం

=====================

రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే వనమహోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొనున్నారు. రేపు పల్నాడు జిల్లాలో నరసరావుపేట మండలం కాకాని జేఎన్టీయూ

క్యాంపస్ లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులతో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలని, అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర సంస్థల్లో ఏకకాలంలో నిర్వహించే వనమహోత్సవానికి సంబంధిత అధికారులు మొక్కలు సరఫరా చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

======================

తూర్పు, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ 30వ తేదీన మరింతగా బలపడి ఉత్తరాంధ్ర దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా తీరాల వైపు ప్రయాణిస్తూ... పశ్చిమ దిశగా మరో 2 రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారిణి జి.లక్ష్మి వివరిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

======================

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 3వ తేదీలోగా పంపించాలని కోరారు.

======================

ప్రతిభావంతులైన ప్రతి క్రీడాకారుడికి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని క్రీడా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (SAAP) ఏర్పాటు చేసిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా యువత క్రీడారంగంలో రాణించాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా వైఎస్సార్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ తేటి శివశంకర్ మాట్లాడుతూ, క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

======================

రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ యాంత్రీకరణ మేళాను ఈ రోజు నిర్వహించారు. ఈ మేళాలోని యంత్రపరికరాలను పరిశీలించిన కలెక్టర్ వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు మారుతున్న సాంకేతికతలో భాగంగా వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగాన్ని, వాటిపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

======================

దేశవ్యాప్తంగా భారతీయ జనతాపార్టీకి 18 కోట్ల మంది సభ్యులుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో  35 లక్షల మంది ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి వెల్లడించారు. గుంటూరులో ఈరోజు జరిగిన పార్టీ కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మాట్లాడుతూ, సెప్టెంబర్ 2వ తేదీన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం కానుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదటి సభ్యునిగా పేరు నమోదు చేసుకుంటారని.. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ప్రారంభమవుతుందని వివరించారు.

======================

======================